క్లుప్తంగా

గట్లకానిపర్తిలో భూ భారతి సదస్సు



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తిలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సు కొనసాగుతోంది. రైతులు అందించిన 329 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ కల్వల సత్యనారాయణ తెలిపారు. ఎమ్మార్వై రమేశ్ ఖన్నా, ఆపరేటర్ నాగరాజ్, రెవెన్యూ సిబ్బంది విజయ్, సత్యం, తులసి, శ్రీకాంత్, శ్రీను, రాజు, రవితేజ, సాయితేజ, సంపత్, గ్రామపంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేలేరులో దరఖాస్తుల స్వీకరణ



వేలేరు : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కోమి అన్నారు. మండల వ్యాప్తంగా చేపట్టిన భూ భారతి సదస్సులు బుధవారంతో ముగిసినట్లు వెల్లడించారు. రైతులు భూ సమస్యలపై మండల వ్యాప్తంగా 742 దరఖాస్తులు సమర్పించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 20 వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్ ఉన్నారు.

పరకాల : మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో బుధవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 127 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు.

మోగిన అంగన్‌వాడీ బడిగంట


నడికూడ : ఐసీడీఎస్ పరకాల ప్రాజెక్ట్ పరిధిలోని మండలంలోని నర్సక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బడిగంట మోగింది. అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ బడిలో పూర్వ ప్రాథమిక విద్యను, పూర్వ గణిత, పూర్వ పఠన, ఆటపాటలతో, కథలతో, తెలుగు, ఆంగ్ల మాధ్యమం బోధించనున్నట్లు తెలిపారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్ సనిత, కోడెపాక సుప్రియ, రజిని, ఆయాలు రాధా, వనజ, ముత్యాలు, రమ, అంగన్‌వాడీ పిల్లలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో పద్మశాలి సంఘం నూతన గ్రామ కమిటీని ఆ సంఘం మండల అధ్యక్షుడు సామల మధుసూదన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసునూటి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా గుండ రవి, కార్యదర్శిగా సామల శ్రీనివాస్, కోశాధికారిగా దాసరి రమేశ్, డైరెక్టర్లుగా గుండా ప్రవీణ్, స్వర్గం ఆగయ్య, వల్లాల శీను, దిండిగాల భిక్షపతి, సామల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు రాజయ్యను మధుసూదన్ శాలువాతో సత్కరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వేలేరు : స్థానిక మాజీ ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి తండ్రి కేశవరెడ్డి, కమ్మరిపేట మాజీ ఎంపీటీసీ వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం గుండ్లసాగర్, కమ్మరిపేట గ్రామాలకు వెళ్లి ఇరువురి మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుడిసెవాసులకు పక్కా గృహాలు కట్టించాలి

నర్సంపేట : పట్టణంలోని సీపీఐ కాలనీలోని గుడిసెవాసులకు పట్టాలిచ్చి పక్కా గృహాలు కట్టించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్ మాట్లాడారు. కాలనీలో తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కాలనీ కమిటీ కార్యదర్శి గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి పిలుస్తోంది..



మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

- మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వం
- అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన
- ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు
- పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి
- నేడు పాఠశాలల పునఃప్రారంభం



పాఠశాలలోని సువిశాలమైన క్రీడా మైదానం

ధర్మసాగర్ : ప్రతిఒక్కరి జీవితంలో బాల్యం, బడి విడదీయలేని బంధం. ఎక్కడో పుట్టి పాఠశాలలో ఒక్కటై చదువుతో పోటీ పడుతూ భవిష్యత్ వేదికలను ఎంపిక చేసుకుంటారు విద్యార్థులు.. అందుకు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మంచి వేదికగా నిలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్ ధ్యేయంగా స్పష్టమైన ప్రణాళిక, పట్టుదలతో పనిచేసే ఉపాధ్యాయ బృందం ఈ పాఠశాల సొంతమనే అభిప్రాయాలు ఉన్నాయి. మెరుగైన విద్య అభ్యసించేందుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల భవిష్యత్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తూ ప్రోత్సహిస్తోందని, ప్రకృతి పరిసరాలలో చదువుకునే విద్యార్థులు సువిశాల ఆట స్థలంలో క్రీడలు ఆడుతూనే చదువుపై మక్కువ పెంచుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని పలువురు కొనియాడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకత..

పాఠశాలలో చేరిన విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, నోట్ బుక్స్ ఉచితంగా అందిస్తున్నారు. ఉన్నత విద్యార్హతలు, అంకితభావం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందిస్తున్నారు. విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, ఆధునిక సాంకేతికత ఉపయోగించి ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా డిజిటల్ విద్యా బోధన, ప్రతి విద్యార్థి చదువు, నడవడికపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువులో పోటీ తత్వాన్ని పెంచుతున్నారు. సువిశాలమైన ఆట స్థలం, వ్యాయామ, విద్య, క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయి శిక్షణలో ప్రతిభ కనబర్చే విధంగా చొరవ చూపుతున్నారు. ప్రతినెల తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి గురించి చర్చ–సమీక్షలు నిర్వహిస్తూ మెరుగైన బోధన ఒత్తిడి లేని విద్య, ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్షలకు ఉచిత శిక్షణ, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. సెమినార్స్, వర్క్‌షాప్‌లు, ప్రతిభా పోటీల నిర్వహణకు ప్రత్యేకంగా డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్ లర్నింగ్ సెంటర్ భవనం అన్ని హంగులతో ఏర్పాటు చేసి విద్యార్థుల అవగాహనను పెంచుతున్నారు. విద్యార్థుల్లో దాగివున్న నాయకత్వ లక్షణాలు, ప్రశ్నించే తత్వం, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు వివిధ క్లబ్‌ల నిర్వహణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్, దూరప్రాంతా విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రభుత్వ ఫలాలను విద్యార్థులకు అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ముఖ్యం. విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేసే విధంగా సహకరించాలి.

– ధర్మప్రకాశ్, ఇంగ్లిష్ టీచర్, ధర్మసాగర్

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



శాయంపేట : మాట్లాడుతున్న ఎంఈఓ భిక్షపతి



ధర్మసాగర్ : స్కావెంజర్లకు సూచిస్తున్న శ్యాంసుందర్

- ఎంఈఓ భిక్షపతి

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలను శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ భిక్షపతి సూచించారు. మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి రిసోర్స్ పర్సన్ వేల్పుల రమేశ్ ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. పాఠశాలలో శుభ్రత, హైజిన్ ప్రాముఖ్యత, టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. శానిటేషన్ సిబ్బంది శానిటేషన్ చేసేటప్పుడు గ్లౌస్, మాస్కులు వాడాలని తెలిపారు. టాయిలెట్స్‌లో డిస్ ఇన్ఫెక్షన్, దుర్వాసన నివారణ కోసం బ్రష్లు, మాపుల వంటి పరికరాలను వాడాలన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను స్కావెంజర్లు శుభ్రపరిచి వారి విధులను సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ కోరారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ధర్మసాగర్ కాంప్లెక్స్ పరిధిలోని 18 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గౌరవ వేతనంతో పనిచేస్తున్న స్కావెంజర్ల శిక్షణ శిబిరం స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు ధర్మప్రకాశ్ అధ్యక్షతన మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. నిపుణులుగా ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ పాఠశాల గదులు, వరండాలు, ఆట స్థలం, మొదలుకొని టాయిలెట్స్ వరకు పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉంచడంలో స్కావెంజర్లు పోషించాల్సిన పాత్ర గురించి వివరించారు. శిక్షణలో పాల్గొన్న స్కావెంజర్లు పాఠశాల గదులు, పరిసరాలు, టాయిలెట్లు శుభ్రపరిచే మెలకువలను, వినియోగించాల్సిన సామగ్రి, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సురేశ్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలి



బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

- ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

పరకాల : బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సూచించారు. మండలంలోని నాగారం గ్రామంలో బడిబాట ర్యాలీని ప్రారంభించడంతో పాటు అంగన్‌వాడీ సెంటర్ లేఎగ్ బిర్యానీ మెనూను ఆయన ప్రారంభించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సెంటర్‌లో వారానికి రెండు రోజులు తప్పకుండా చిన్నారులకు, గర్భిణులకు మహిళలకు ఎగ్ బిర్యానీ అందుబాటులో ఉంచాలని అన్నారు. రెండున్నర సంవత్సరాల నుంచి 5 సంవత్సరాలు ఉన్న పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్కూరి స్రవంతి, ఐకేపీసీసీ రమాదేవి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ప్రసన్న, రమాదేవి, కవిత, శారదా, అంగన్‌వాడీ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

సహకరించిన అందరికీ త్వరలో సన్మానం



మాట్లాడుతున్న బొక్కల నారాయణ

ఐనవోలు : ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాలకు సహకరించిన ప్రతిఒక్కరికీ జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సన్మానించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం చింత అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నూతన కమిటీలతో పాటు గద్దెలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సంఘాలు చేసిన పోరాటానికి పలు రకాలుగా సహకరించిన వారందరి జాబితా తయారు చేయాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా నాయకులు కట్కూరి రమేశ్, మరుపట్ల దేవదాస్, ఆరోగ్యం, ఏలియా, బాబు, కుమారస్వామి, ప్రవీణ్, రవి, విష్ణు, రాజేశ్, వివేక్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



షోడాషపల్లి ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రవీందర్‌సింగ్

వేలేరు : నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్ బుధవారం మండలంలోని శాలపల్లి, షోడాషపల్లి, వేలేరు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి తరగతి గదులు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని వినూత్న ప్రచారం



బైక్‌కు మైక్ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని అధ్యాపకులు బైక్‌కు మైకు ఏర్పాటు చేసి మండల కేంద్రంలోని వాడవాడకు తిరుగుతూ వినూత్న ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు.

మహిళా సంఘాల ఉన్నతికి ప్రాధాన్యం

నల్లబెల్లి : ప్రభుత్వం మహిళా సంఘాల ఉన్నతికి ప్రాధాన్యత ఇస్తోందని డీపీఎం దయాకర్ తెలిపారు. స్థానిక మదర్ థెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన వార్షిక మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి సమాఖ్య పాలకవర్గం పాటుపడాలని సూచించారు. చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలని కోరారు. రుణాలు, శిక్షణ, నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం సమాఖ్య పాలకవర్గాన్ని అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి ప్రకటించారు. అధ్యక్షురాలిగా జంగిలి మమత, కార్యదర్శి ఈర్ల స్వప్న, కోశాధికారిగా ముత్యాల మౌనికతోపాటు సభ్యులు ఎన్నికైనట్లు వెల్లడించారు.

మార్కింగ్ చేసి.. ముగ్గు పోసి



ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరై లబ్ధిదారులు అధికారులతో కలిసి ముగ్గు పోశారు. మండల కేంద్రంలోని మారేపల్లి దీవెన, కురాకుల శ్రీజకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ మార్కింగ్ చేసి ముగ్గుపోశారు. పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ (బుజ్జన్న) పాల్గొని మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాసాని శాంతరవి, చిందం రవి, చింతల రవిపాల్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మారేపల్లి వరదరాజు, నాయకులు రాజేందర్, క్రాంతికుమార్, వంగరి సాంబయ్య పాల్గొన్నారు.

నెలాఖరు వరకే మీకు టైం..

- ఆర్వోబీని పూర్తిచేయకుంటే కూల్చేస్తాం
- కాంట్రాక్టర్, అధికారులకు బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి హెచ్చరిక



ఆర్వోబీని పరిశీలిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

కమలాపూర్ : నెలాఖరులోగా ఉప్పల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)ని పూర్తిచేయని పక్షంలో కార్యకర్తలతో కలిసి వచ్చి ప్రజలకు క్షమాపణలు చెప్పి జేసీబీతో ఆర్వోబీని తామే కూల్చేస్తామని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో హుజూరాబాద్–పరకాల మార్గంలో నిర్మిస్తున్న ఆర్వోబీని స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఎప్పటి వరకు ఆర్వోబీని పూర్తి చేస్తారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు పదేళ్లుగా ఉప్పల్ వద్ద కాంట్రాక్టర్లు, అధికారుల బదిలీల కారణంగా ఆర్వోబీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఈ విషయంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఉప్పల్ ఆర్వోబీని పరిశీలించి ఆర్వోబీని త్వరితగతిన పూర్తి చేయకపోతే తానే స్వయంగా వచ్చి కూల్చివేస్తానని హెచ్చరించారని గుర్తుచేశారు.ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సుధాకర్, నాయకులు సుందరయ్య, సదానందం, శంకర్, శ్రీనివాస్, శ్రీనివాస్, లచ్చన్న, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

రైతులు పంటమార్పిడి చేసుకోవాలి

- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సాయికిరణ్



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఎల్కతుర్తి : రైతులు పంటమార్పిడి చేసుకుని నేల సారాన్ని కాపాడుకోవాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జీ.సాయికిరణ్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కేవీకే మామునూరు ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ముందుగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ, పాడిపశువులకు సంబంధించిన ప్రణాళిక సూచనలు, ముఖ్య ఉద్దేశాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన సాంకేంతిక పరిజ్ఞానం గురించి చర్చించి వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరారు. రైతులు ఒకే పంటకు బదులుగా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా నేలసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. వరి, మొక్కజొన్న, పత్తితో పాటు వివిధ రకాల నూనె గింజల పంటలు ఆముదం, నువ్వులు, కుసుమ, పప్పు దినుసులను సాగు చేసుకోవాలని సూచించారు. రైతులు సాగుచేసిన పంటల్లో జీవన ఎరువులను విరివిగా వినియోగించాన్నారు. దీని ద్వారా నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటదిగుబడి వస్తుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం రైతుల సమస్యలకు శాస్త్రవేత్తల బృదం సలహాలు, సూచనలు ఇస్తుందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఇండోరియా, ఎఫ్ఎస్ఎమ్ కన్సల్‌టెంట్ అధికారి సారంగం, సాయిచంద్, ఏఈఓలు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న మహేందర్, సురేశ్

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గులో దళితుల భూములను కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేశ్ కోరారు. బుధవారం హనుమకొండలో బాధిత దళితులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1999లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు 18 ఎకరాలు పంపిణీ చేశారని, హైవేకు దగ్గరలో ఉండడంతో దళితులను కొందరు బెదిరించి కబ్జాకు పాల్పడుతున్నారని చర్య తీసుకోవాలని కోరా రు. విశ్వరత్న సమాజ నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు పెండెల భిక్షపతి, రైతులు నవీన్, రవి, మహేందర్, మొగిళి, సారయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీల పెంపుపై భగ్గుమన్న బీజేపీ



పరకాల : ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి సామాన్యులపై ఆర్థిక భారం మోపే నిర్ణయాలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్ రెడ్డి స్పష్టం చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను నిరసిస్తూ బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టి బస్టాండ్ కూడలిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేయగా పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, పట్టణ అధ్యక్షుడు నిరంజన్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గురుప్రసాద్, పరకాల, నడికూడ మండలాల అధ్యక్షులు రాజ్‌కుమార్, దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్, తదితరుల పాల్గొన్నారు.

చార్జీలను వెంటనే తగ్గించాలి

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి బుధవారం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్ అంటూ మహిళలకు హామీ ఇచ్చి ఇతరులపై, విద్యార్థులపై అధిక చార్జీలను మోపుతుందన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోనలో ఉన్నారని, పెరిగిన జీవన వ్యయంతో ఇప్పటికే కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్సు చార్జీలతో విద్యార్థులకు మరింత భారం తప్పడం లేదన్నారు. బస్ చార్జీలను తగ్గించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

చేతిపంపు ఏర్పాటు

ఐనవోలు : బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో మండలంలోని పంథిని ప్రభుత్వ పాఠశాలలో చేతిపంపును ఏర్పాటు చేయగా ఎంఈఓ పులి ఆనందం బుధవారం ప్రారంభించారు. కెనడా దేశంలో ఐదో తరగతి చదువుతున్న థియోరోస్పోర్ట్ విద్యార్థి ప్రోత్సాహంతో తోటి విద్యార్థుల పాకెట్ మనీ ద్వారా నిధులు సమకూరినట్లు తెలిపారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులను తీర్చేందుకే చేతిపంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్ణచందర్‌రావు, ఏఏపీసీ చైర్మన్ మాధవి, ప్రైమరీ హెచ్ఎం రాజు, బాల వికాస ప్రతినిధులు ఉన్నారు.